జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 101 గురువారం 4 సెప్టెంబరు – 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## చదువు, సాగునీరే మా ఎజెండా




- కేసీఆర్‌ను ఎంపీని చేసినా న్యాయం జరుగలేదు
- ఎత్తిపోతల పథకాలు పూర్తి కాలేదు.. పీయూ పీజీ కాలేజీలా మిగిలిపోయింది
- పాలమూరు బిడ్డ సీఎం అయ్యాక లా, ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ వచ్చాయి
- 14 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశాం
- విద్య, సాగు నీటి రంగాలకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు
- నారాయణపేట– కొడంగల్ లిఫ్టునకు ఎన్‌జీటీకి వెళ్లి అడ్డుపుల్లలు వేస్తున్నారు
- పేదరికానికి పాలమూరు ఎగ్జిబిషన్ కావొద్దు.. ప్రగతి పథానికి వేదిక కావాలి
- మూసాపేటలో ఎస్‌జీ కార్నింగ్ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్) : 'ఏళ్లుగా పాలమూరు జిల్లా వలసలకు మారు పేరుగా ఉంది. బాక్రానంగల్, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్‌పీ ఇలా దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా తట్ట పని, మట్టి పని, పార పనిలో పాలమూరు వలస జీవుల పాత్ర ఉంది. కష్టపడేతత్వం ఉన్న పాలమూరు ప్రజలు ఉన్నత స్థాయిలో రాణించకపోవడానికి ఎ డ్యుకేషన్, ఇరిగేషన్ లేకపోవడమే ప్ర ధాన కారణం. ఇప్పుడు ప్రజా ప్ర భుత్వం వాటినే ఎజెండాగా తీసుకుని పని చేస్తుంది. పేదరికానికి ఇకపై పాలమూరు ఎగ్జిబిషన్ కాదు. ప్రగతి పథానికి వేదిక కావాలి" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేటలో ఉన్న ఎస్‌జీ కార్నింగ్ పరిశ్రమలో రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి సీఎం బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇకపై నూతన పరిశ్రమలకు వేదిక అవుతుందని, జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్రంలోని ప్రజలకు ఉపాధి ఇక్కడ దొరుకుందని తెలిపారు. ఏళ్లుగా పాలమూరు నిరాదరణకు గురైందన్నారు. అందుకే కేసీఆర్‌ను పాలమూరు నుంచి గెలిపిస్తే.. ఈ ప్రాం తానికి సముచిత న్యాయం చేయలేదన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ కాంగ్రెస్ హ యాంలో వస్తే దాన్ని పట్టించుకోకుండా పీజీ కాలేజీకి పరిమితం చేశారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీరింగ్, లా కాలేజీలు తెచ్చామని అన్నారు. కొత్తగా డిగ్రీ కాలేజీలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పాలమూరులో ట్రిపుల్ ఐటీ కాలేజీ మంజూరు చేశామని, అద్భుతమైన క్యాంపస్ త్వరలో రూపుదిద్దుకుంటుందని అన్నారు. 14 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశామని, 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2,800 కోట్లతో వాటిని నిర్మించబోతున్నామని తెలిపారు. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారని, ఆ తర్వాత 75 ఏళ్లకు పాలమూరు బిడ్డకు సీఎం అవకాశం వచ్చిందన్నారు.

## వెంట నడిచేదెవరో...!

**బీఆర్ఎస్‌లో కలిసిపోయిన 'జాగృతి' శ్రేణుల్లో సందిగ్ధం**

**జిల్లాలో ఇప్పటికీ కవితతో సత్సంబంధాలు**

**- 2008లోనే సిరిసిల్ల నుంచి జాగృతి పయనం**

**- తాజా పరిణామాలతో సిరిసిల్ల నియోజకవర్గంలో ఉత్కంఠ**



సెప్టెంబరు 3(సందేశం టైమ్స్): బీఆర్ఎస్‌లో నెలకొన్న తాజా పరిస్థితులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో విభిన్నమైన చర్చలకు దారితీశాయి. బీఆర్ఎస్ నుంచి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను బీఆర్ఎస్ నుంచి తొలగించడం.. బుధవారం ఆమె పార్టీకి రాజీనామా చేయడమే కాకుండా పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవిని కూడా వదులుకుంటున్నట్లు ప్రకటించారు. గులాబీలో ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో కలిసి పనిచేస్తున్న జాగృతి శ్రేణులు అయోమయంలో పడ్డారు.

**జాగృతి తొలి అడుగు సిరిసిల్ల నుంచి..**

తెలంగాణ జాగృతి సంస్థ తొలి అడుగులు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మొదలైనట్లు చెప్పుకుంటున్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 2009లో అప్పుడు టీఆర్ఎస్ అభ్యర్థిగా కే తారకరామారావు బరిలోకి రాకముందే 2008 సంవత్సరంలోనే జాగృతి పేరుతో కవిత పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పలు మండలాల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను స్థాపించారు. పలు కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నాలు చేశారు. ప్రజా ఉద్యమాలకు మద్దతునిచ్చారు. సిరిసిల్లలో నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న క్రమంలో వారి కుటుంబాల్లోని మహిళకు కుట్టు శిక్షణ అందించడానికి పరిశీలన చేశారు. ప్రస్తుతం ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు వద్ద అనంతగిరి గుట్టలపైన పశ్చిమ చాళుక్యుల నాటి కోట చరిత్రను ప్రజల ముందుకు తీసుకురావడం విశేషం. కవిత కార్యక్రమాలకు వారి బంధువులు మద్దతునిచ్చారు.

## కవిత ఎపిసోడ్.. కుటుంబ డ్రామా: సీతక్క

**అది కేసీఆర్ కుటుంబ పంచాయితీ: అడ్లూరి**

**కాళేశ్వరంపై కాంగ్రెస్ చెప్పిందే కవిత చెప్పింది: ఆది శ్రీనివాస్**



హైదరాబాద్/హనుమకొండ సిటీ, సెప్టెంబరు 3(సందేశం టైమ్స్): కవిత ఎపిసోడ్ కుటుంబ రాజకీయ డ్రామా అంటూ మంత్రి సీతక్క కొట్టిపారేశారు. తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కేసీఆర్.. నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోపెట్టి మాట్లాడి సర్దుబాటు చేయలేని బలహీన పరిస్థితికి చేరుకున్నారా అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమ సంపాదన పంపకాల్లో వచ్చిన తేడా వల్లే కేసీఆర్ కుటుంబ సభ్యులు గొడవలు పడుతున్నార న్నారు. కేటీఆర్‌ను కవిత వెనకేసుకురావడమూ పెద్ద డ్రామా అని ఆమె విమర్శించారు. హరీశ్ వెనుక సీఎం రేవంత్‌ఉంటే.. కాళేశ్వరం అవినీతిపైన విచారణ కమిషన్‌ను ఎందుకు నియమిస్తారని, ఆ కేసును లోతైన విచారణ కోసం సీబీఐకి ఎందుకు అప్పగిస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణకుమార్ ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి బయటపడ్డాక కేసీఆర్ కుటుంబంలో పంచాయితీ మొదలైందన్నారు. మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌లో ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

## కవిత.. కేసీఆర్ విడిచిన బాణం

**ప్రజల్ని మభ్యపెట్టేందుకే కొత్త నాటకం**

**కేటీఆర్‌పై ఎక్కుపెట్టిన బాణం..హరీశ్ వైపునకు ఎందుకు మళ్లింది? :మహేశ్ గౌడ్**



హైదరాబాద్, సెప్టెంబరు 3(సందేశం టైమ్స్) కవిత.. కేసీఆర్ విడిచిన బాణమేనని టీపీసీసీ చీఫ్ మహేషకుమార్‌గౌడ్ అన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకు కేసీఆర్ కుటుంబం ఆడుతున్న కొత్త నాటకమిదన్నారు. కవిత అమెరికా వెళ్లి తిరిగి రాగానే తన స్టాండ్‌ను ఎందుకు మార్చారని.. అంతకుముందు కేటీఆర్‌పైకి ఎక్కుపెట్టిన బాణం.. హరీశ్‌రావుపైకి ఎందుకు మళ్లిందని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడం శుభ పరిణామమని, అయితే ఆమె ఐదేళ్ల ముందే ఈ రాజీనామా చేసుంటే ప్రజలు అంగీకరించి ఉండేవారన్నారు.

## 2028 జనవరి నాటికి SLBC పనులు పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్



సెప్టెంబరు 3(సందేశం టైమ్స్): 2028 జనవరి నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లో ఎస్ఎల్‌బీసీ పనుల పునఃప్రారంభంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆధునిక పరిజ్ఞానంతో మిగిలిన 9 కి.మీల మేర ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

## మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి



హైదరాబాద్/ములుగు, సెప్టెంబరు 3(సందేశం టైమ్స్): తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని, ఈ మేరకు మహాజాతరను నిర్వహించనున్నట్లు మంత్రులు మంత్రి కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జాతర ఏర్పాట్లు, ప్రాంగణంలో శాశ్వత నిర్మాణాలపై మంత్రులు సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి చాంబర్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడారం పూజారుల సూచనల మేరకు వనదేవతల ప్రాంగణ నూతన డిజైన్‌ను మంత్రులు పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను మహాజాతరలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు, నిర్మాణ సంస్థను మంత్రులు ఆదేశించారు.

## మునగాల వద్ద రసాయన ట్యాంకర్ దుర్వినియోగం

## పంటలకు నష్టం రైతుల ఆందోళన పోలీసులు చర్యలకు హామీ



సూర్యాపేట జిల్లా,సందేశం టైమ్స్: మునగాల:మునగాల మండలం ముకుందాపురం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన రసాయనాల ట్యాంకర్ దుర్వినియోగం కలకలం రేపింది. తేదీ 01-09-2025 రాత్రి, గుర్తు తెలియని ఒక ట్యాంకర్ రహదారి పక్కన ప్రమాదకరమైన రసాయనాలతో నిండిన ద్రవాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయింది.స్థానిక రైతు నర్రా వెంకట నర్సిరెడ్డి ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, రసాయనం పొలంలోకి చేరి సుమారు 30 సెంట్ల వరకు పంటలు నష్టపోయాయని తెలిపారు. పొలం ఎర్రగా మారిపోయిందని, భరించలేని దుర్వాసన వస్తోందని, గతంలో కూడా ఇలాంటి సంఘటన జరిగినట్లు వివరించారు.రైతుల భయాలుఈ సంఘటనతో గ్రామంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ రసాయనాలు మానవ ఆరోగ్యానికి, జంతువులకు, నేల సారానికి హాని కలిగిస్తాయనే భయం.పంటలపై పడితే ఆర్థిక నష్టమే కాకుండా ఆహార భద్రతకూ ముప్పు.వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో రైతులు అసహనంతో ఉన్నారు.పోలీసుల స్పందనరైతు ఫిర్యాదు మేరకు మునగాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.ఫిర్యాదు స్వీకరించి జారీ చేశారు.ఎస్ఐ గారు స్పందిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పర్యావరణంపై ప్రభావంనిపుణుల అభిప్రాయం ప్రకారం:గుర్తు తెలియని రసాయనాలు భూగర్భ జలాల్లో కలిసే ప్రమాదం ఉంది.నేల సారానికి దీర్ఘకాలిక నష్టం జరగవచ్చు.రసాయనాల వాసనతో గ్రామస్తుల ఆరోగ్యానికి ముప్పు తలెత్తే అవకాశం ఉంది.రైతుల డిమాండ్గ్రామస్తులు, రైతులు ప్రభుత్వాన్ని, స్థానిక అధికారులను కోరుతున్నారు:1. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి.2. రసాయనాన్ని వదిలిన బాధ్యులను గుర్తించి శిక్షించాలి.3. పంట నష్టానికి పరిహారం అందించాలి.4. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలుతీసుకోవాలి.పంటలకు నష్టం రైతుల ఆందోళన పోలీసులు చర్యలకు హామీ

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన

## నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





సందేశం టైమ్స్:నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి శంకరంపేట్ మండల కేంద్ర పరిధిలోని రైతు వేదికలో ఈరోజు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు మొత్తం 39 మరియు చెక్కులు మొత్తం 20 చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క పేదవాడికి ప్రతి ఒక్క పథకం అందే విధంగా మా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు మరియు షాదీ ముబారక్ చెక్కులు ఇవ్వడానికి 2 నుండి 3 సంవత్సరల వరకు సమయం పట్టేదని ఒక్కో చెక్కు అయితే అది కాంగ్రెస్ పార్టీ వాడు అని తెలిస్తే చాలు ఆ చెక్కును ఇవ్వకుండా చింపేసిన రోజులు కూడా ఉన్నాయని ఎమ్మెల్యే గారు అన్నారు. మా ప్రజా ప్రభుత్వం కానీ నేను కానీ పార్టీలకు అతీతంగా ఒక ఆడబిడ్డను కష్టపెట్టాలని ఉద్దేశం దుర్బుద్ధితో లేకుండా ప్రతి ఒక్కరికి పార్టీతో సంబంధం లేకుండా చెక్కులను వచ్చిన వెంటనే వారికి అందజేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రతి పేదవాడికి 10 లక్షల రూపాయల వరకు ఆసుపత్రి వైద్యానికి మా ప్రభుత్వం అందిస్తుందని దానిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు.పేదలకు కడుపునిండా అన్నం పెరట్టాలన్న ఉద్దేశతో అర్హులైన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందిస్తూన్నామని అలాగే 10 సంవత్సర కాలం నుండి రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారి కలలను నిజం చేసి తన రేషన్ కార్డులను అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు శంకరంపేట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు, మహిళలు, పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

## త్వరగా భూ సమస్యలను పరిష్కరించండి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట, సందేశం టైమ్స్: ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయాలని, భూ భారతి చట్టం కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన వెబ్ఎక్స్ సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు.ప్రజవాణి అర్జీలకు త్వరిత పరిష్కారం:కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజలు ఎంతో నమ్మకంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రెవెన్యూ అధికారులు రైతులకు సహాయపడే విధంగా విధులు నిర్వహించాలి" అని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను, మీసేవ ద్వారా వచ్చిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. భూ భారతి చట్టం అమలుభూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సరైన కారణాలను స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. అదనపు నమోదులు ఉన్న సర్వే నంబర్లను గుర్తించి, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అర్హత లేని వారి పేర్లను తొలగించాలని, అర్హులైన వారి పేర్లను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపేదల సొంతింటి కల నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందని, రెవెన్యూ అధికారులు ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రెటరీలతో సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికీ ఉచితంగా ఇసుక సరఫరా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఇంకా, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, కోర్టు కేసులను కూడా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులనుఆదేశించారు.

## శోభాయాత్ర, నిమర్జన సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా

## సుమారు 800 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు.


## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.



**గణనాథుని శోభాయాత్రకు సర్వం సిద్ధం.. పెద్ద శబ్దాలతో కూడిన డి.జె సౌండ్స్ వినియోగించరాదు..నిమర్జన సమయంలో సమయమనం పాటించాలి..**

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధిరేపు గురువారం, మరియు శనివారం (తేది:04/06-09-2025) జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో వినాయకుల నిమర్జనాలు జరగనున్న నేపధ్యలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సుమారు 800 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ గారు వివరించారు. గణేష్ శోభాయాత్ర వెళ్ళే మార్గంలో కరెంట్ వైర్ లేకుండా సంభందిత శాఖలకు అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని అన్నారు. పలు ప్రధాన కూడళ్లలో, మజీద్లు, దర్గాలలు, చర్చీల పై రంగులు (గులాల్) పడకుండా ఎతైన బారికెట్స్ తో పాలితిన్ కవర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శోభాయాత్రను వీక్షించడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిమర్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద నీళ్ళలోనికి దిగకుండా బారికెట్స్ ఏర్పాటు చేయించడం జరిగిందని, విగ్రహాలను నిమర్జనం చేయడానికి క్రేన్ లను అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రమాదవశాత్తు అనుకోని ప్రమాదం జరిగిన తక్షణం స్పందించడానికి గజ-ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.సబ్-డివిజన్ల వారీగా డియస్పి లచే బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం జరుగుతుందని, అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు తక్షణం స్పందించి, గుంపును చెదరకొట్టడానికి స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టిమ్స్ సిద్దంగా ఉంటాయన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులు పోలీసు వారితో సహకరించవలసిందిగా ఎస్పీ గారు సూచించారు.గణనాథుని శోభాయాత్ర, నిమజ్జన సమయంలో పాటించవలసిన సూచనలు:1. ఊరేగింపులో డి.జె. లకు అనుమతిలేదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డి.జె.లు వినియోగిస్తే, అట్టి డి.జె. లను సీజ్ చేయడంతో పాటు, సంభందిత నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది.2. వినాయక విగ్రహములను తీసుకొనివెళ్లే వాహనములలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, టపాకాయలు, మండే స్వభావం కలిగిన పదార్ధాలు అనగా పెట్రోలు, డీజిల్ మొదలగునవి ఉంచరాదు.3. విగ్రహలను తీసుకొని వెళ్లే వాహనాల, డ్రైవర్ల యొక్క పూర్తి వివరాలు పోలీసు వారికి తెలియజేయాలి. వాహనం మంచి కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలి4. నిమజ్జనంలో పాల్గొనే వారు ఎలాంటి మత్తు పదార్థాలు సేవించకుండా నిర్వాహకులు జాగ్రత్తపడాలి.5. ఎలాంటి వదంతులను నమ్మకూడదు, ఏదైనా సమాచారం తెలిసినా, అసత్య ప్రచారాలు చేసినా అలాంటి వ్యక్తుల వివరాలను డయల్ 100 ద్వారా లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలి6. ఊరేగింపులో కుంకుమ, గులాల్ మొదలైన రంగులను దారిన పోయే వారిపైచల్లకూడదు.

## గ్రామాల్లో మినీ గ్రంథాలయాలు కోసం వినతి




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో ఉన్న కమ్యూనిటీ భవనాల్లో మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలనీ బిఎస్పి జిల్లా ఇంచార్జి పీపడ్ పల్లి మోహన్ గ్రంథాలయాల సంస్థల జిల్లా ఛైర్మెన్ జి. అంజయ్య కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో మినీ గ్రంథాలయాల ఏర్పాటు తో యువకులు ఉద్యోగాల ప్రిపరేషన్ కు ఉపయోగపడుతుందన్నారు. అదేవిదంగా విద్యార్థుల్లో పుస్తకాలను చదవటం అలవాటై ఫోన్ లకు దూరంగా ఉండే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు దూరమైనా పొదుపు, నీతి కథలు గ్రంథాలయాల ద్వారా దగ్గరయ్యి, సెల్ ఫోన్ అడిక్ట్ కు గురికాకుండా మానసిక వికాసం పొందుతారని అభిప్రాయపడ్డారు. మినీ గ్రంథాలయాల ఏర్పాటు పై ఛైర్మెన్ సానుకూలంగా స్పందించినట్లు మోహన్ తెలిపారు. ఆయన వెంట పంబల్ల దుర్గాప్రసాద్ తదితరులుఉన్నారు..

# సంపాదకీయం

## బీఆర్ఎస్ భవితవ్యం ఏమిటి

భారతదేశంలో ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉన్నదా? తెలంగాణలో ఒకప్పుడు ఉజ్వలమైన పాత్రను పోషించిన భారత రాష్ట్ర సమితి దుస్థితి చూస్తుంటే ఈ అనుమానం రాకమానదు. బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న పరిస్థితి అన్ని ప్రాంతీయ పార్టీలకూ వస్తుందని చెప్పలేము కాని బీఆర్ఎస్ దుస్థితి నుంచి మాత్రం ప్రాంతీయ పార్టీలు, వాటి నేతలు ఎలా వ్యవహరించకూడదో తెలుసుకునే అవకాశం ఉన్నది, తెలుసుకోవాలి కూడా. గత లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించాయి. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్ సంఖ్యాబలం కంటే రెట్టింపుకు పైగా సంఖ్యాబలం ప్రాంతీయ పార్టీలదే. అంత మాత్రాన ప్రాంతీయ పార్టీల పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. ఇందుకు 2024 జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే తార్కాణం. కాని బీజేపీకి మద్దతునిచ్చిన ప్రాంతీయ పార్టీల్లో ఒక్క తెలుగుదేశం, జేడీ(యు) ప్రధాన పార్టీలు కాగా మిగతావన్నీ చిన్నా చితక పార్టీలు. ఎన్డీఏలో ఉన్నామని చెప్పుకుంటున్న దాదాపు 20 పార్టీలకు ఒక్క సీటూ లేదు. ఇండియా కూటమిలో కూడా సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ మాత్రమే ప్రధాన పార్టీలు. దాదాపు 30కి పైగా పార్టీలు రెండు కూటముల్లోనూ అయిదు స్థానాలలోపే సాధించగా, వాటిలో మెజారిటీ పార్టీలకు కేవలం ఒక్కొక్క సీటే లభించింది. బీజేడీ, బీఆర్ఎస్, అన్నాడీఎంకే వంటి ప్రధాన పార్టీలు అదృశ్యం కాగా, శివసేన, లోక్ జనశక్తి, ఎన్‌సీపీ, జేఎంఎం వంటి పార్టీలు నిలదొక్కుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజానికి భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీల్లో కెల్లా జూనియర్ పార్టీ. డీఎంకే 1949లోనూ, ఆ పార్టీ నుంచి చీలిన అన్నాడీఎంకే 1972లోనూ జన్మించాయి. శివసేన 1966 నుంచీ ఉనికిలో ఉన్నది. జార?ండ్ ముక్తి మోర్చా 1972లో ఆవిర్భవించింది. తెలుగుదేశం 1982లో ఏర్పడితే, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ 1990వ దశకంలో జన్మించాయి. ఈ పార్టీలన్నీ ఇవాళ్టికీ అస్తిత్వంలో ఉండగా అవి ఏర్పడిన ఎంతో కాలానికి జన్మించిన బీఆర్ఎస్ మాత్రం ఎందుకు అంతర్గత సంక్షోభంలో చిక్కుకున్నది? ఈ విషయమై ఆ పార్టీ ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.చాలా ప్రాంతీయ పార్టీలకు ఒక సిద్ధాంతం, చరిత్ర, లక్ష్యాలు ఉన్నాయి. అవి రాజ్యాంగంలో పీఠిక లాంటివి. ఇటీవల మరణించిన జేఎంఎం అధినేత శిబూసోరెన్ కేవలం రాజకీయ నాయకుడు కాదు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఉపాధ్యాయుడైన తన తండ్రిని 1957లో హత్య చేస్తే వారికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాడుతూ ఎదిగిన ప్రజా నాయకుడు. ఆదివాసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం, వారిని కట్టుబానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం పోరాడినవాడు. డీఎంకేకు 1916 నుంచే ద్రవిడ ఉద్యమం నిర్వహించిన చరిత్ర ఉన్నది. పెరియార్, అన్నాదురైలు నిర్మించిన వారసత్వం ఉన్నది. ఇవాళ స్టాలిన్ ఆ వారసత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియా సామాజిక న్యాయం కోసం ప్రారంభించిన పోరాట క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ ఉద్భవించాయి. ములాయం తర్వాత అఖిలేశ్, లాలూ తర్వాత తేజస్వి తమ తండ్రుల దారిలో రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొంటున్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా 85 ఏళ్ల వయస్సులో శరద్ పవార్ మరాఠా ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పోరాడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి కూడా బెంగాలీల ఆత్మగౌరవానికి తానే ప్రతీకగా భావిస్తూ బీజేపీని శాయశక్తులా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగు వారి ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన తెలుగుదేశం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రాష్ట్ర విభజన జరిగినా అస్త్ర సన్యాసం చేయకుండా నిలదొక్కుకుని ఇవాళ కేంద్రంలో ఎన్డీఏ సర్కార్‌కు కీలక మద్దతునిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. చంద్రబాబు లాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతోనూ కాంగ్రెస్‌తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టినవారు కాదు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించేవారు కారు. మరి కేసీఆర్‌కు ఏమైంది? ఆయన పార్టీ ఎందుకు లుకలుకలకు గురవుతోంది? కారణం ఏమంటే తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ కేసీఆర్ దూరం కావడమే. నేల విడిచి సాము చేయడమే. చాలా మంది ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్‌కు లేవు. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేందుకు తోడ్పడింది.కేసీఆర్ పార్టీ ప్రారంభించిన ఏడేళ్ల వరకూ కేటీఆర్, కవిత దరిదాపుల్లో ఉండేవారు కాదు. 'మా రాము అమెరికాలో ఉంటాడు. నెలకు 300 డాలర్లు పంపుతాడు. తెలంగాణ ఏర్పడకపోయినా నా మనుగడకేమీ ఢోకా లేదు' అని ఆయన తుగ్లక్ రోడ్‌లో కేటీఆర్‌ను పరిచయం చేసిన రోజులున్నాయి. చాలా పార్టీల్లో ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం సహజం. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూ, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. అన్నీ సజావుగా జరిగాయి.

## మంచి కర్మలే మంచి ఫలితాలను ఇస్తాయి

# న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్



సందేశం టైమ్స్ :సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 3సంగారెడ్డి జిల్లా పట్టణంలోని ఐబి ప్రాంగణంలో మెగా పిరమిడ్ ఆవశ్యకత గురించి, ధ్యానం యొక్క విలువల గురించి చలో తిరుపతి ధ్యాన మహా యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కులాలకు అతీతంగా మతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా సదాశివపేట పట్టణం సిద్ధాపూర్ గ్రామంలో స్వాతంత్ర సమరయోధుల ఆశయాల సాధనలో భాగంగా ఏర్పాటు చేసే మెగా పిరమిడ్ క్షేత్రం అక్షరధామ్ లోని స్వామి నారాయణ దేవస్థాన ఆకృతిలో నిర్మాణం 108 కోట్లతో జరుపబడుతుందని, ఇందుకు శ్రీ తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో లక్షమంది జన సమీకరణతో త్వరలో పనులు ప్రారంభం జరుగుతాయని పిరమిడ్ మాస్టర్ల సమక్షంలో వివిధ జిల్లాల నాయకుల సమక్షంలో ప్రజల సమక్షంలో విద్యార్థిని విద్యార్థుల సమక్షంలో మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల సమక్షంలో తెలియజేశారు అదేవిధంగా ఇట్టి క్షేత్రం యొక్క విలువను తెలుసుకునేందుకు సెప్టెంబర్ 16 రోజు నుండి 22 వరకు తిరుపతిలో మహతి ఆడిటోరియంలో ధ్యాన మహా యజ్ఞాలు నిర్వహించబడతాయి ఇట్టి కార్యక్రమాలకు ప్రత్యేక ఆహ్వానం పి ఎస్ ఎస్ యమ్ ఛానల్ డైరెక్టర్ ఆనంద్ ప్రసాద్ పిలుపునిస్తూ ధ్యాన మహా యజ్ఞమే, ప్రపంచ శాంతికి మార్గమని తెలియజేశారు, ఇట్టి మార్గాన్ని యావత్ ప్రపంచంలో ఉన్న జీవరాశులన్నీ అనుసరిస్తే అంతా ధ్యానమయం శాంతి మయం జరుగుతుందని తెలియజేశారు అదేవిధంగా తిరుపతిలో జరగబోయే కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ప్రజలందరూ పేరుపేరునా పాల్గొనాలని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో మెదక్ కాంటెస్టెడ్ ఎంపీ సాయ గౌడ్, వికారాబాద్ కాంటెస్ట్ ఎమ్మెల్యే రామ్ రాజ్, నర్సాపూర్ లక్ష్మి పిరమిడ్ వ్యవస్థాపకులు బి సత్యనారాయణ మాస్టర్, పి ఎస్ ఎస్ ఎమ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంగమేశ్వర్ మాస్టర్ గ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాస్టర్ వివిధ జిల్లాల నాయకులు, ప్రజలు మరియు యువకులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

# ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను లైసెన్స్డ్ సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలి....

# జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి. ఏ .ఐనేష్

## మొదటి విడత శిక్షణలో ఉత్తీర్ణులైన లైసెన్స్ సర్వేయర్లకు సర్టిఫికెట్ లు అందజేత



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 3ఆగస్టు తెలంగాణ ప్రభుత్వం నూతన రెవెన్యూ సంస్కరణలలో భాగంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సర్వేయర్లకు సంబంధించిన స్థానం కల్పించిందని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఏ. ఐనేష్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన లైసెన్స్ సర్వేయర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేయర్లకు పెద్ద ఎత్తున అవకాశం ఇవ్వడం జరుగుతుందని మొదటి విడత ఉత్తీర్ణులైన సర్వేర్లు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు . భూములకు సంబంధించి క్రయవిక్రయాలు జరిగిన లేదా ఇతర ఎలాంటి లావాదేవీలు జరిగిన సంబంధిత భూములకు సంబంధించి సర్వే, సర్వే మ్యాప్ లను ఆధారంగా చేసుకుని ఇక మీదట భూభారతి చట్టంలో జరిగేలా ప్రభుత్వం నూతన చట్టం తీసుకువచ్చింది అన్నారు. దీంతో సర్వేయర్లకు, లైసెన్స్ సర్వేయర్లకు అనేక అవకాశాలు ఏర్పడతాయన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను లైసెన్సుడ్ సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తప్పులకు అవకాశం లేకుండా భూములకు సంబంధించిన కొలతలు మ్యాపులను రైతులకు అందించాలని సూచించారు. శిక్షణలో ఉత్తీర్ణులు కానీ సర్వేయర్లకు ఈనెల 13 ,14 తేదీలలో మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఏ. ఐనేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్లు ఎం రాజు, శ్రీనివాస్, బిక్షపతి, రుహుల్ల, కార్యాలయ సూపరిండెంట్ ఇందిరా ట్రైనింగ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

# శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 3సెప్టెంబర్ సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వేల్లి గ్రామం లో ఈ రోజు ఫస్ట్ వార్డు లో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో చేయడం జరిగింది.ముఖ్య అతిథిగా మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు గ ణపతి పూజ కార్యక్రమం లో పాల్గొని, తీర్థప్రసాదం స్వీకరించి, తదానంతరం గణనాథుని సన్నిధిలో అనేకమంది భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆరవ రోజు పూజలు నిర్వహించిన అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనేకమంది భక్తులు కుల,మత భేదం లేకుండా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలోమాజీ ఉపసర్పంచ్ మంగలి వీరయ్య, చాకలి మొగులయ్య, చాకలి వీరేష్ వార్డు,చాకలి అరవింద్, కాలాలి వినోద్, తమ్మాలి అరుణోదయ, చాకలి హరి, చాకలి అశోక్, కాలాలి అనిల్ కుమార్, బత్తిని జగదీష్, సాదుల మహేష్, సాదుల సాయి, సాదుల చిన్న, పోచారం సోను, మల్లపాడు సమీర్, అడ్డు,చాకలి కుమార్, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున వచ్చి తీర్థ ప్రసాదం స్వీకరించడంజరిగింది



# ప్రోత్సాహకాలు ఇంకెప్పుడు



- ♦ పారిశ్రామికవేత్తలకు 5 వేల కోట్లకుపైగా బకాయిలు
- ♦µ వైసీపీ హయాం నుంచి పెండింగ్‌లోనే
- ♦ నాలుగేళ్లు బకాయిపెట్టిన జగన్ సర్కార్
- ♦ ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ
- ♦ మే 15లోపే నిధులు ఇస్తామన్న మంత్రులు
- ♦ ఇప్పటి వరకు పైసా విదల్చని వైనం
- ♦ కొవిడ్ నుంచి ట్రంప్ సుంకాల వరకు పారిశ్రామికవేత్తలకు దెబ్బపై దెబ్బ

:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు చెల్లించడంతో కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం బాటలోనే నడుస్తోంది. "రాష్ట్రంలో పరిశ్రమలకు చెల్లించాల్సిన రూ. 5 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాల బకాయిలను మే 15వ తేదీ లోపు విడుదల చేస్తాం. ఇక మీదట క్రమం తప్పకుండా ప్రోత్సాహకాలు విడుదల చేసేలా దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో మెకానిజం (ప్రత్యేక ఖాతా)ను అందుబాటులోకి తీసుకువస్తాం" అని ఆరు నెలల క్రితం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో పారిశ్రామిక పాలసీల మార్గదర్శకాలు విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. కానీ, ఇంతవరకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వం కూడా పరిశ్రమలకు ఏటా ఆగస్టులో పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేస్తామంటూ క్యాలెండర్లను కూడా ప్రకటించింది. 2020-21 సంవత్సరంలో మాత్రమే రెండు విడతలుగా సుమారు రూ. 800 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత నుంచి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా చివరికి చేతులెత్తేసింది. ఆ నాలుగేళ్లలోనే రూ. 5 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాలు బకాయిలుగా పేరుకుపోయాయి. పెండింగ్ బకాయిలను విడుదల చేసి సంక్షోభంలో కూరుకుపోయిన పరిశ్రమలకు కొత్త ఊపిరి పోస్తామన్న కూటమి ప్రభుత్వం కూడా ఏడాది కాలంగా పట్టించుకోవడంలేదు. దీంతో తీవ్ర నష్టాలతో రాష్ట్రంలో తమ యూనిట్లను నడపలేమంటూ పారిశ్రామికవేత్తలు చేతులెత్తేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్స్ బకాయిలను విడుదల చేస్తే పరిశ్రమలు తిరిగి నిలదొక్కుకోవడానికి అవకాశముంటుందని పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

దళితులకు జగనన్న దగా

దళిత పారిశ్రామికవేత్తలను జగన్ ప్రభుత్వం దగా చేసింది. 2020-23లో ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా 'జగనన్న బడుగు వికాసం' పథకం కింద రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 45 శాతం రాయితీలు అందిస్తామని నాటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. దళితుల ఎంఎస్ఎంఈ యూనిట్లకు విద్యుత్తు చార్జీల రీయింబర్స్‌మెంట్, అమ్మకం పన్ను, మూలధన రాయితీ తదితర ప్రయోజనాలు కల్పిస్తామంటూ ప్రకటించారు. ఆయన మాటలు నమ్మి రాష్ట్రంలోని వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి, ప్రైవేటుగా అప్పులు చేసి వ్యాపారాలు ప్రారంభించారు. మొత్తంగా రాష్ట్రంలో ఎస్సీ పారిశ్రామికవేత్తలు 7,675 యూనిట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మరో 1,320 యూనిట్లు నిర్వహిస్తున్నారు. వీరికి దాదాపు రూ. 1,200 కోట్ల వరకు ప్రోత్సాహకాలు పెండింగ్‌లో పెట్టేశారు. అప్పులు, వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, తమ యూనిట్లు ఎన్‌పీఏలోకి వెళ్లిపోతున్నాయని, రవాణా వాహనాలు సీజ్ అయిపోతున్నాయని, తమకు రావాల్సిన రాయితీల నిధులను విడుదల చేసి ఆదుకోవాలంటూ దళిత పారిశ్రామికవేత్తలు ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఏడాదిగా అదిగో ఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో దళిత పారిశ్రామికవేత్తలు రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవలే మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్ ముందు ఆందోళనకు దిగారు. సెప్టెంబరులో ఇన్సెంటివ్స్ విడుదలయ్యే అవకాశం అధికారుల చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

## మిగులు బార్లకు నోటిఫికేషన్



అమరావతి:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): మిగులు బార్లకు బుధవారం నోటిఫికేషన్‌జారీచేయనున్నట్లు ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రకటించారు. నేటి నుంచి ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, 15న ఉదయం లాటరీ నిర్వహిస్తారని తెలిపారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా 432 బార్లు మిగిలిపోయాయి. 924 బార్లలో 492 బార్లకు ఇప్పటివరకు లైసెన్సీలు ఎంపికయ్యారు. వాటిలో 80 బార్లు కల్లు గీత కార్మికుల కేటగిరీలో ఉన్నా యి. దరఖాస్తులు తక్కువగా వస్తున్నందున ఈసారి వాటి స్వీకరణకు ఎక్కువ రోజులు గడువు పెట్టారు. సాధారణం గా వారం రోజులు పెట్టే గడువును 12రోజులకు పెంచారు.

## ఆర్థిక నిపుణుడు నాగరాజుకు నాయుడమ్మ పురస్కారం



- ఈ ఏడాది అవార్డుకు ఎంపికైన ఐఏఎస్ అధికారి
- ఈనెల 10న తెనాలిలో పురస్కారం ప్రదానం
- అవార్డు అందజేయనున్న తెలంగాణ గవర్నర్

తెనాలి,:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కారానికి ఆర్థిక వ్యవహారాల నిపుణుడు, ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాల ఎంపికయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖలో ఆర్థిక సేవల విభాగ కార్యదర్శిగా ఉన్న ఆయనకు 2025 సంవత్సరం పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. ప్రఖ్యాత చర్మశాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన డాక్టర్ నాయుడమ్మ బాపట్ల జిల్లా అమృతలూరు మండలం యలవర్రు గ్రామంలో జన్మించారు. నాయుడమ్మ పేరుపై ఏటా శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని నాగరాజు మద్దిరాలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈనెల 10న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందించనున్నారు. సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి. కాంత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాగా, మద్దిరాల నాగరాజు 1993వ బ్యాచ్‌కు చెందిన త్రిపుర కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన కృష్ణా జిల్లాలో 1966లో జన్మించారు. ప్రస్తుతం 2025 కేంద్ర బడ్జెట్ రూపకల్పన భాగస్వామిగా ఉన్నారు.

## డీఎస్సీలో భర్తీకాని 700 పోస్టులు



అమరావతి,:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): మెగా డీఎస్సీలో ప్రకటించిన 16,347 పోస్టుల్లో అభ్యర్థులు లేక సుమారు 700 పోస్టులు మిగిలే పరిస్థితి కనిపిస్తోంది! ఇప్పటివరకూ జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనతో అధికారులు ఈ అంచనాకు వచ్చారు. కాగా.. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మొత్తం పూర్తవడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. రెండో విడతలో 627 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా.. వారిలో 480 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. బుధవారం మధ్యాహ్నానికి రెండో విడత ప్రక్రియ పూర్తిచేసి, సాయంత్రం నుంచి మూడో విడత పరిశీలన ప్రారంభిస్తారు. మొత్తంగా 15,600 మంది అభ్యర్థులే ఎంపికయ్యే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన పోస్టులను తర్వాత డీఎస్సీలో భర్తీ చేస్తారు. కాగా.. కొత్తగా ఎంపికైన టీచర్లకు దసరా సెలవుల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈలోపే వారు పాఠశాలలకు వచ్చే అవకాశం ఉంది. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక ఎంపికైన వారి జాబితాలు ప్రకటిస్తారు. అనంతరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తారు.

## అనకాపల్లి వద్దు బాబోయ్!



:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్)::జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో తహశీల్దారు ఉద్యోగమంటే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇక్కడ తహశీల్దారుగా పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. కానీ కొంతకాలంగా ఇక్కడ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. అనకాపల్లి తహశీల్దారు పోస్టు అంటేనే వెనకడుగు వేస్తున్నారు. స్థానిక నేతల ఒత్తిళ్లే ఇందుకు ప్రధాన కారణమని తెలిసింది.మూడు నెలల కిందట జరిగిన బదిలీల సందర్భంగా అనకాపల్లి తహశీల్దారుగా వచ్చేందుకు ఒక్కరు కూడా ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ఆర్డీఓ కార్యాలయం ఏఓ.. తహశీల్దారు విధులు నిర్వహించారు. పరిపాలన పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ విజయకృష్ణన్ చొరవ తీసుకొని ఎస్.రాయవరం తహశీల్దారుగా పనిచేస్తున్న విజయకుమార్‌ను అనకాపల్లికి బదిలీ చేశారు. కొద్ది రోజులకే ఆయనపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోవడంతో కలెక్టరేట్ ఏఓగా బదిలీ చేయించుకున్నారు. తరువాత అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన భాస్కర అప్పారావును అనకాపల్లి తహశీల్దారుగా నియమించారు. ఆయన కూడా ఇక్కడ ఎక్కువ రోజులు పనిచేయలేకపోయారు. స్థానిక నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్ల రావడంతో రెండు రోజుల కిందట అనారోగ్య సమస్యల పేరుతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు.అనకాపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్, 22ఏ జాబితా నుంచి భూముల తొలగింపు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ, మ్యుటేషన్‌లు, ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపుల్లో బినామీ పేర్లు చేర్చడం వంటివి పెరిగాయి.

## తనయుడి వర్ధంతి నాడే తల్లి మృతి

ఒంగోలు క్రైం:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): తనయుడి వర్ధంతి రోజే తల్లి మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి భద్రతా అధికారిగా ఉన్న అద్దంకి సాల్మన్‌కేరి వెస్లీ ఆయనతోపాటు 2009లో నంద్యాల జిల్లా పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన 16 వర్ధంతి మంగళవారం. ఆ రోజే ఆయన తల్లి కమల వెస్లీ(94) వయోభారంతో మృతి చెందారు. కాగా వర్ధంతి నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వెస్లీ విగ్రహానికి పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక మిరియాలపాలెంలోని వెస్లీ స్వగృహంలో కమల వెస్లీ భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఎస్పీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఆర్ఎంపీ వైద్యం వికటించి.. వివాహిత మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- %ప్రభుత్వాసుపత్రికి మృతదేహం తరలింపు

ఏలూరు క్రైం, :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్)::ఆర్ఎంపీ వైద్యం వికటించి జ్వరంతో బాధపడుతున్న ఓ వివాహిత మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మృత దేహంతో ఆర్ఎంపీ క్లినిక్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు తూర్పు వీధి మేకల కబేళా ప్రాంతానికి చెందిన కటారి భారతి లక్ష్మి(25)కు భర్త వెంకటేశ్వరరావు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావు ఒక ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. లక్ష్మి మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. నాని క్లినిక్ నిర్వహిస్తున్న వంగాయగూడేనికి చెందిన ఆర్ఎంపీ గంచరి సురేశ్ బాబు(నాని) వద్దకు ఆమెను ఉదయం తీసుకు వెళ్లగా రెండు ఇంజక్షన్లు చేశాడు. ఇంజక్షన్లు చేసిన కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వైద్యుడిని ప్రశ్నించగా ఏం కాదని కొంత సేపు విశ్రాంతి తీసుకోవాలని సూచిం చాడు. ఆమె ఎంతకీ మేల్కొనకపోవడంతో ఏలూరు టూ టౌన్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. బంధువులు మృతదేహాన్ని నాని క్లినిక్ వద్దకు తీసుకువచ్చి ఆందోళన చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సిబ్బంది వచ్చి పరి స్థితిని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రాగన్ ఫ్రూట్, ఆవకాడో సాగుపై ఆసక్తి



చింతపల్లి,:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): గిరిజన ప్రాంతంలో అరుదైన ఉద్యాన పంటలు డ్రాగన్ ఫ్రూట్, ఆవకాడో సాగుపై ఆదివాసీ రైతులు ఆసక్తి చూపుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడంతో పాటు మూడేళ్ల సాగు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. దీంతో గిరిజన ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్, ఆవకాడో సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. చింతపల్లి పరిధిలో ఈ ఏడాది 46 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, 89 ఎకరాల్లో ఆవకాడో సాగుకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని గిరిజన ప్రాంతం ఉత్తర భారతదేశ వాతావరణాన్ని పోలి ఉంటుంది. దీంతో అరుదైన ఉద్యాన పంటలపై శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేపట్టారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఆవకాడో, డ్రాగన్ ఫ్రూట్ సాగుపై పరిశోధనలు నిర్వహించి గిరిజన ప్రాంతానికి అనువైనవిగా గుర్తించారు. 2004లో కేంద్ర కాఫీ బోర్డు అధికారులు ఆవకాడోను పరిచయం చేశారు. కాఫీ పంటకు నీడ కోసమని గొందిపాకలు గ్రామంలో కొంత మంది రైతులకు ఆవకాడో మొక్కలను పంపిణీ చేశారు. ఈ మొక్కలు మంచి దిగుబడి ఇస్తున్నాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను 2008లో లంబసింగిలో తెనాలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశ్రీరామ్ సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించారు. నాటి నుంచి కొంత మంది రైతులు వ్యక్తిగత ఆసక్తితో డ్రాగన్ ఫ్రూట్, ఆవకాడోను సాగు చేస్తున్నారు.

# గుడ్డుకు భలే డిమాండ్



విశాఖపట్నం:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):గుడ్డు ధర పరిగెడుతోంది. కొద్దిరోజులుగా మార్కెట్ డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోగా.. ఇదే సమయంలో తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి గుడ్ల ఎగుమతికి ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో తగినంత స్టాకు లేక ధర పెరుగుతోంది. విశాఖపట్నంలో 100 గుడ్ల ధరను రూ.575 (హెూల్‌సేల్)గా నిర్ణయించారు. ఈ ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. రోజువారీ 50 లక్షల గుడ్లు ఉత్పత్తి అయ్యే ఉత్తరాంధ్రలో ప్రస్తుతం 46 లక్షల నుంచి 47 లక్షల గుడ్లు వస్తున్నాయి. ఇదే పరిస్థితి రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో నెలకొంది. గుడ్ల ఉత్పత్తి తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ధర గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. చిన్నరైతులు పూర్తిగా గుడ్లు ఉత్పత్తి చేసే కోళ్ల పెంపకానికి స్వస్తి చెప్పారు. జూన్, జూలై నెలల్లో తీవ్రమైన ఎండలు కాయడంతో ఆ ప్రభావం కోళ్లపై పడింది. వీటన్నింటితో గుడ్ల ఉత్పత్తి తగ్గింది. వర్షాకాలంలో ఉత్తరాది, మధ్య భారతంలో కూరగాయల పంటలు దెబ్బతినడంతో గుడ్ల వినియోగం పెరిగింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా కొన్ని రాష్ట్రాలు ఈ ఏడాది నుంచి పాఠశాలల పిల్లలకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు సరఫరా ప్రారంభించాయి. ఏపీ, తెలంగాణ నుంచి ఆయా రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇలా పలు కారణాలతో స్థానిక మార్కెట్‌లో డిమాండ్ రావడంతో ధరలు పెరుగుతున్నాయని అనకాపల్లి జిల్లాకు చెందిన పౌల్ట్రీ రైతు ఒకరు చెప్పారు. మార్కెట్ డిమాండ్‌కు తగినంత సరఫరా జరిగేంత వరకు గుడ్ల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు.

# నెలంతా..రేషన్!



**15రోజుల కాలపరిమితి ఎత్తివేత**

**%365 రోజులు రేషన్ దుకాణాలు**

**17 లక్షల కార్డుదారులు**

**ఉమ్మడి జిల్లాలో అమలు**

కలెక్టరేట్(కాకినాడ):సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): రేషన్‌కార్డుదారులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు నెలంతా తెరిచే విధంగా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేయనుంది. ఇప్పటికే దీనిపై ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపై నెలంతా రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో 17 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల ఒక టో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. అయితే వివిధ పనులపై ఇతర ప్రాం తాలకు వెళ్లిన కూలీలు, సామాన్యులు ఒక్కొక్క పర్యాయం అనుకున్న సమయానికి రేషన్ తీసుకోలేకపోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తు వులు వదిలుకోవాల్సి వస్తోంది. తాజాగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లు విరిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇవ్వడం వల్ల కేవలం 90 శాతం కార్డుదారులకు మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో అయితే పోర్టబులిటీ విధా నం వల్ల ప్రతి నెల పదో తేదీ వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం నిండు కుంటు న్నా యి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజ మహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో ప్రతి నెల పదో తేదీకే 50 శాతం రేషన్ దుకాణాల్లో బియ్యం నిండుకుం టున్నా యి. దీనివల్ల బియ్యాన్ని పేదలు పొందలేక పోతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కాలంటే నెలంతా రేషన్ పంపిణీ ద్వారా సాధ్యపడుతుంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రేషన్ పంపిణీ చేయడం వల్ల ఏదైనా వీలున్న సమయంలో సరకులు తెచ్చుకునే సౌలభ్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రెండువేల రేషన్ దుకాణాలు ఇక నుంచి నెలంతా ఓపెన్ చేసే ఉంటాయి.

# పొదిలి చేరిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర



పొదిలి :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): విద్యా పరిరక్షణ సైకిల్ యాత్ర 6వ రోజు కురిచేడు నుంచి ప్రారంభమై దర్శి మీదుగా సాయంత్రం పొదిలి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్, మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి, ఎల్ఐసి అభివృద్ధి అధికారి కందుల రవి విద్యార్థుల కు స్వాగతం పలికారు. సైకిల్ యాత్ర బృందం సభ్యులు స్థానిక జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి కేటాయిస్తున్న మెస్ చార్జీలు పెంచాలని కోరారు. పొదిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ హాస్టల్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, సొంత భవనం నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్ఐసి అభివృద్ధి అధికారి కందుల రవి యాత్ర బృందానికి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సైకిల్ యాత్ర నాయకులు సిహెచ్ వినోద్, వీరాస్వామి, కె విజరు, పాండురంగారావు, అరుణ్, గంగాంజి, ఆనంద్, అశోక్, ఎఫ్రాయీం, దాసు, సాయికుమార్ వున్నారు.

# మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ



:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన వదినా, మరదళ్ళ కుటుంబాలను పలువురు పరామర్శించారు. ఏలేశ్వరం శివారు మందులు కాలనీకి చెందిన పెంద్ర లక్ష్మి(36), ఆమె చినమామ కుమార్తె పెంద్రా కుమారి ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయి మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్ఏ వరుపుల సత్యప్రభ హుటాహుటీనా ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో తహశీల్దార్ పి.ఆనంద్‌కుమార్, ఆర్ఐ ఎస్.పొన్నాలు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను పాల్గొన్నారు. ఇసుక తరలింపు వల్లే ప్రమాదంఏలేరు కాలువలో అక్రమార్కులు జెసిబిలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోవడంతో ఏర్పడిన గొయ్యల వలనే ఇద్దరి నిండు ప్రాణాలు పోయాయని సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు, సిపిఐ (ఎంఎల్) వినోద్ మిత్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి ఏలేరు కాలువలో యంత్రాలతో ఇసుక తవ్వకుండా చర్యలు చేపట్టాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం



ఫిరంగిపురం ::సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని మేరికపూడిలో గుంటూరు కర్నూలు రహదారిపై జరిగింది. స్థానికులు వివరాలు ప్రకారం.. నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతోంది. మేరికపూడికి చెందిన రుసుం భార్గవ్ (25), అతని తండ్రి వెంకటేశ్వర్లు (70) ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వైపు వస్తున్నారు. బస్సు మేడికపూడి గ్రామంలోకి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న భార్గవ్ వేగంగా వచ్చి బస్సును ఢకొట్టాడు. బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులిద్దరూ కిందపడడంతో భార్గవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వర్లును 108 ద్వారా నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతి చెందారు. మృతదేహాలను నరసరావుపేటలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనా స్థలిని ఫిరంగిపురం ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి కేసు నమోదు చేశారు. అవివాహితుడైన భార్గవ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు.

# రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు




:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ డిమాండ్ చేశారు. కోటనందూరులో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కోటనందూరు సెంటర్లో మానవహారం చేపట్టారు. ఎన్‌కె.పద్మతోపాటు, ఆటో యూనియన్ నాయకులు ముక్కుడుపల్లి బాబురావు, మహమ్మద్ రఫీ, మాట్లాడారు. స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధిని కోల్పోయారని అన్నారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి నెలకి రూ.26 వేలు ఇస్తే ఆటోల్లో మహిళలను ఉచితంగానే తీసుకెళ్తామని అన్నారు. అనంతరం ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నందిక సత్యనారాయణ, ఇజం కోదండరాంబాబు, తోలెం సత్యనారాయణ, కుప్ప రాజు, తోలుం అప్పారావు, డొక్కా అజరుబాబు, కాండ్రకోట లోవరాజు, కాపరపు బాలు, టెక్కలి రమణ, నాగేశ్వరరావు, కిషోర్, కాకర కొండబాబు, బొడ్డు ప్రసాద్ గంగాధర్ పాల్గొన్నారు,

# ఎంబీబీఎస్ సీటు సాధించిన హెూంగార్డు కుమారుడు



శ్రీకాకుళం క్రైం,:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డు చక్క వాసు దేవరావు కుమారుడు శశిధర్‌నాయుడు ఎంబీబీఎస్ సీటు సాధించడంపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆనందం వ్యక్తం చేసి అభినందించారు. ఇటీవల నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి విశాఖలోని ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడి కల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ మేరకు శశిధర్ నాయుడు తల్లిదండ్రులతో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ హెూం గార్డుల కుటుంబాల సంక్షేమం కోసం జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

# మెట్రో రైలులో గ్రీన్ చానల్..

## - గుండె, ఊపిరితిత్తుల తరలింపు
## - 45 నిమిషాల్లోనే రెండు ఆస్పత్రులకు చేరవేత



హైదరాబాద్ సిటీ: సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): హైదరాబాద్ మెట్రో రైలులో గ్రీన్ చానెల్ ద్వారా గుండె, ఊపిరితిత్తులను రెండు వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. సకాలంలో వాటిని అమర్చడంతో ఇద్దరికి పునర్జన్మనిచ్చినట్లయింది. రాత్రి 9గంటల నుంచి రాత్రి 10గంటల మధ్య ఈ గ్రీన్ చానల్ చేపట్టారు. ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రిలో ఓ దాత నుంచి సేకరించిన గుండెను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వద్ద యశోద ఆస్పత్రికి చేర్చారు. 11 కి.మీ. దూర ప్రయాణాన్ని కేవలం 16నిమిషాల్లోనే పూర్తి చేశారు. అలాగే, ఊపిరితిత్తులను కూడా ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రి నుంచి మాదాపూర్ యశోద ఆస్పత్రికి చేర్చారు. %21 మెట్రో స్టేషన్లను దాటుకొని 27కి.మీ. దూరాన్ని 43నిమిషాల్లోనే ప్రయాణించి ఈ ప్రక్రియను పూర్తి చేశారు. రాత్రి సమయంలో ఒకవైపు వర్షాలు, మరోవైపు ట్రాఫిక్ రద్దీ ఉన్నప్పటికీ కేవలం 45నిమిషాల వ్యవధిలోనే గుండె, ఊపిరితిత్తులను రెండు ప్రాంతాలకు తరలించామని ఎల్ అండ్ టీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు వైద్య నిపుణులు, ఆస్పత్రి అధికారులు ఎంతో సమన్వయం చేసుకుని ఈ గ్రీన్‌చానల్ ప్రక్రియను పూర్తి చేశారని పేర్కొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య పథకంపై వారంలో విధివిధానాలు

## దశలవారీగా సమస్యల పరిష్కారానికి సర్కారు హామీ ఇచ్చింది
## మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అనంతరం ఉద్యోగ సంఘాల ఐకాస వెల్లడి
## బస్సుయాత్ర, చలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటన



హైదరాబాద్, :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించిన విధివిధానాలను వారం రోజుల్లో ఖరారు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఉద్యోగుల ఐకాస వెల్లడించింది. దీంతో తాము తలపెట్టిన బస్సుయాత్ర, చలో హైదరాబాద్ కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ సమావేశం నిర్వహించింది. అనంతరం ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో భేటీ వివరాలను వెల్లడించారు. డిప్యూటీ సీఎం, ఉప సంఘం చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఉద్యోగులు కోరుతున్న నగదు రహిత చికిత్స అందించేందుకు వీలుగా ఆరోగ్య పథకం అమలుకు ఈనెల 8వ తేదీలోపు విధివిధానాలను ప్రకటిస్తామన్న హామీ లభించిందని వెల్లడించారు. ఆపై వీలైనంత త్వరగా ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు జారీ చేస్తామని చెప్పారని తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి గతంలో ఇచ్చి న హామీ మేరకు ప్రతి నెలా రూ.700 కోట్లు చెల్లిస్తామని చెప్పారని వెల్లడించారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని, విజిలెన్స్, ఏసీబీ కేసులతో రెండేళ్లకుపైగా సస్పెన్షన్‌లో ఉన్నవారికి దశలవారీగా పోస్టింగులు ఇవ్వనున్నట్లు చెప్పారని వెల్లడించారు. ఉద్యోగులు, ప్రభు త్వం వేరు కాదని.. సుపరిపాలన కోసం అందరం కలిసి పని చేద్దామని భట్టి విక్రమార్క తమతో అన్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రతిపాదించిన 63 డిమాండ్లలో 25కు పైగా ప్రభుత్వం నెరవేర్చిందని, మిగిలిన సమస్యలనూ ద శలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# 1070 హైడ్రా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి..

హైదరాబాద్ :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): ప్రజలకు మరింత చేరువయ్యేందుకు హైడ్రా టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణ/కబ్జాలు, విపత్తుల నిర్వహణ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1070ను కేటాయించింది. ఇప్పటి వరకు ప్రజావాణి, ఎక్స్ ద్వారానే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉండగా.. తాజాగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రజావసరాలకు కేటాయించిన ఆస్తుల కబ్జాపై



8712406899 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వాట్సాప్ ద్వారా పంపాలని రంగనాథ్ సూచించారు. వరద సమస్యలు, విపత్తులపై ఇప్పటికే అందుబాటులో ఉన్న 8712406901, 9000113667 నంబర్లకూ సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు.

# తక్షణసాయం రూ.200 కోట్లు

## వరదల నష్టంపై సర్కారు మంజూరు
## తీవ్రంగా ప్రభావితమైన 7 జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున..
## మిగతా జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున..
## రోడ్లు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతుల వంటి పనులకే వాడాలని స్పష్టీకరణ



హైదరాబాద్ :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో ఇటీవల వర్షాలు, వరదలతో జరిగిన నష్టానికి తక్షణసాయం కింద జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు విపత్తులశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అధిక వర్షపాతం నమోదై, భారీ నష్టం జరిగినట్టు గుర్తించిన కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున.. మిగిలిన 26 జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిధులను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్‌డీఆర్ఎఫ్) నిబంధనల మేరకు తక్షణ మరమ్మతులు చేపట్టడానికే ఉపయోగించాలని ఉత్తర్వుల్లో జిల్లాల కలెక్టర్లకు సూచించింది. ప్రధానంగా రోడ్లు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతులకు, తాగునీటి సరఫరా పరంగా ఏర్పడిన అవాంతరాలను సరిచేసేందుకు మాత్రమే నిధులను వినియోగించాలని స్పష్టం చేసింది. ఈ నిధులతో కొత్త పనులు చేపట్టొద్దని, పంట నష్ట పరిహారానికీ వినియోగించొద్దని స్పష్టం చేసింది. పనుల కోసం వినియోగించిన నిధులకు సంబం?ధించిన వినియోగ పత్రాల (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్)ను సంబం?ధిత విభాగానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఆగస్టు 25 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 50 సెం.మీ కన్నా ఎక్కువగా వర్షపాతం నమోదవ్వగా, మిగతా జిల్లాల్లో 25–40 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది. ఫలితంగా జిల్లాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లడంతో పాటు, పంట నష్టం, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయని గుర్తించినట్టు జిల్లాల నుంచి సమాచారం వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# జూబీజూబ్లీహిల్స్‌లో 3,92,669 మంది ఓటర్లు



హైదరాబాద్, :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఇందులో 2,04,288 మంది పురుష ఓటర్లు, 1,88,356 మంది మహిళలు కాగా, 25 మంది ఇతరులని వివరించారు. ఓటర్లు తమ అభ్యంతరాలను ఈ నెల 17లోపు తెలియజేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో చేర్చడం లేదా తొలగించడం, సరిదిద్దడం, వేరే నియోజకవర్గానికి మార్చడం వంటి అభ్యంతరాలుంటే... 6, 7, 8 ఫారాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అభ్యంతరాలన్నింటినీ ఈ నెల 25లోపు పరిష్కరిస్తామన్నారు. ఓటర్ల తుది జాబితాను ఈ నెల 30న బహిర్గతం చేస్తామని వివరించారు.

# ఇక అద్దెకు ఆర్టీసీ ఈవీ బస్సులు..

హైదరాబాద్ :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): ఐటీ కారిడార్‌లో ఎలక్ట్రిక్, మెట్రో డీలక్స్ బస్సులను ప్రముఖ ఐటీ సంస్థలకు అద్దెకిచ్చే దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో వేలసంఖ్యలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆఫీసులకు వచ్చి తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు వినియోగిస్తే ఐటీకారిడార్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించే అవకాశం ఉంటుందని ఆర్టీసీ భావిస్తోంది. ఐటీ కారిడార్ కేంద్రంగా ఆర్టీసీ 200 ఎలక్ట్రిక్ ఏసీ, నాన్‌ఏసీ బస్సులతో పాటు మరో 250 మెట్రో ఎక్స్‌ప్రెస్, డీలక్స్, ఆర్డినరీ బస్సులను నడుపుతోంది. సీబీఎస్, బాచుపల్లి, శంషాబాద్, ఈఎస్ఐ, రిసాల్‌బజార్,ఉప్పల్,



సికింద్రాబాద్, కోఠి, మియాపూర్ తో పాటు గ్రేటర్ పరిధిలోని 13 ప్రాంతాల నుంచి 450 బస్సులను ఐటీ కారిడార్ మీదుగా నడుపుతోంది. ఐటీకారిడార్‌లో ప్రజా రవాణా సేవలు మరింత విస్తరించడంతో పాటు ఐటీ కంపెనీలకు వచ్చే ఉద్యోగులు ఆర్టీసీ సేవలు వినియోగించుకునేలా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఐటీ సంస్థలు ప్రజారవాణా వ్యవస్థను ప్రోత్సహించాలని, ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వామ్యమయ్యే ఉద్యోగులకు ప్రోత్సహకాలు ఇచ్చే అంశాలను ఆర్టీసీ పరిశీలిస్తోంది. %మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలకు ఉద్యోగులు వచ్చి, వెళ్లేందుకు బస్సులు అద్దెకివ్వాలని ఆర్టీసీ భావిస్తోంది. అక్టోబరులో గ్రేటర్‌జోన్‌కు 275 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని ఈ బస్సులను ఐటీ కంపెనీల ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా అద్దెకిచ్చి, ఇతర సమయంలో నగరంలో తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ఉన్నతాధికారులు ఐటీ కంపెనీల ప్రతినిధులకు వివరించారు.

# మైక్రో బూవరీలకు దరఖాస్తుల ఆహ్వానం

:సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్):బీరు ప్రియులకు శుభవార్త. ఇన్నాళ్లూ రాష్ట్ర రాజధానికే పరిమితమైన మైక్రో బ్రూవరీలు త్వరలో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో ఉన్న 16 కార్పొరేషన్‌ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. తక్కువ పరిమాణంలో వివిధ రకాల రుచుల్లో బీరును ఉత్పత్తి చేసి అక్కడికక్కడే విక్రయించే యూనిట్లను మైక్రో బ్రూవరీలు అంటారు. పబ్‌లు, స్టార్ హోటళ్లు, కొన్ని బార్లలో ఈ మైక్రోబ్రూవరీలు ఉంటాయి. గ్రేటర్ జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 18



మైక్రోబ్రూవరీలకు అనుమతులు ఉన్నాయి. అయితే, తొలిసారిగా జీహెచ్ఎంసీ బయట ఉన్న కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ ప్రకటన జారీ చేసింది. మైక్రో బ్రూవరీలు ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు సెప్టెంబరు 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సూచించింది.

# జీహెచ్ఎంసీలో డిజైనింగ్ సెల్..




హైదరాబాద్ :సెప్టెంబర్ 3 (సందేశం టైమ్స్): హెచ్-సిటీలో భాగంగా భారీ స్థాయిలో వంతెనలు, అండర్‌పాస్?లు నిర్మించనున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ లో నూతన విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుల డిజైన్ల రూపకల్పనకు అంతర్గత డిజైనింగ్ సెల్ (ఇన్–హౌస్ డిజైనింగ్ సెల్)ను ఏర్పాటు చేస్తూ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిజైన్ల రూపకల్పనకు ప్రైవేట్ కన్సల్టెంట్‌లపై ఆధారపడడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని అధికారికంగా ఆదేశాలిచ్చారు. %సూపరింటెండెంట్ ఇంజనీర్ నేతృత్వంలో సీనియర్ ఇంజనీర్లతోపాటు ఖరగ్‌పూర్, గౌహతి, మద్రాస్ ఐఐటీ ల్లో, వరంగల్, రూర్కెల ఎన్ఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివిన జీహెచ్ఎంసీలోని ఇంజనీర్లకు నూతన సెల్‌లో చోటు కల్పించారు. ఎంపిక చేసిన పది మంది ఇంజనీర్లను రిలీవ్ చేయాలని ఎస్ఈ అడ్మిన్‌ను కమిషనర్ ఆదేశించారు. ప్రాజెక్టుల విభాగం చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో ఈ సెల్ పని చేయనుంది.

# బిజినెస్



# కొనసాగుతున్న 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం.. కాసేపట్లో కీలక నిర్ణయాలు..



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం జరుగుతోంది. దాదాపు అన్ని రాష్ట్రాల మంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో కేంద్రం ప్రతిపాదించిన జీఎస్టీ సంస్కరణలపై చర్చ జరుగుతోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న 12%, 28% పన్ను శ్లాబ్‌లను తొలగించి, 5%, 18% అనే రెండు మాత్రమే పన్ను రేట్లుగా ఉంచే ప్రతిపాదన ఉంది. కొంత ప్రత్యేకమైన వస్తువులపై 40% ప్రత్యేక పన్ను వసూలు చేయాలని కూడా సూచించారు. కాసేపట్లో వీటిపై కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

రేట్ల రేషనలైజేషన్ ప్రస్తుతం నాలుగు రేట్ల (5%, 12%, 18%, 28%) ఉన్న వ్యవస్థను సులభతరం చేసేందుకు ప్రభుత్వం రెండు ప్రధాన శ్లాబ్‌ల (5% మరియు 18%)వైపు మారాలని చూస్తోంది. దీనివల్ల పలు వస్తువులపై పన్ను తగ్గే అవకాశం ఉంది.

మెరిట్ స్టాండర్డ్ గూడ్స్ వస్తువులను మెరిట్ (అత్యవసరమైన) స్టాండర్డ్ (సాధారణ)గా వర్గీకరించి, వీటిపై తక్కువ %+ూ% అమలు చేయాలని భావిస్తున్నారు. ఉదాహరణకు మెరిట్ గూడ్స్‌కి 5% వరకే పరిమితం చేయనున్నారు.

ఈ గూడ్స్ పై 40% ట్యాక్స్ పొగాకు, ఆల్కహాల్, లగ్జరీ కార్లు వంటి గూడ్స్ మీద ప్రత్యేకంగా 40% ట్యాక్స్ విధించాలని ప్రతిపాదన ఉంది. దీంతో పాటు ఆరోగ్య సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి విభాగాలు కూడా చర్చకు వస్తున్నాయి. 12% ? 5%, 28% ? 18%ప్రస్తుతం ఉన్న 12% ట్యాక్స్ కింద ఉన్న వస్తువులను 5% లోకి, 28%లో ఉన్న వాటిని 18% కిందకి తేవాలని సూచనలున్నాయి. దీని వల్ల మధ్యతరగతి ప్రజల ఖర్చులు తగ్గే అవకాశం ఉంది.

ఇన్సూరెన్స్ పై మినహాయింపు?ప్రస్తుతం 18% %ఉన్న జీవన మరియు ఆరోగ్య బీమాలపై ట్యాక్స్ పూర్తిగా మినహాయించాలనే ప్రతిపాదన ఉంది. ఇది ప్రజలకు పెద్ద ఊరట కలిగించనుంది.

అమెరికా టారిఫ్‌లకు సమాధానంగా...

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50% టారిఫ్‌ల ప్రభావాన్ని తక్కువ చేయడానికీ ఈ మార్పులు తోడ్పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇండియా నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న రూ. 48 బిలియన్ల గూడ్స్‌కు ఇది కొంత ఉపశమనంగా మారే ఛాన్సుంది. బలమైన బూస్ట్ 26 మొదటి త్రైమాసికంలో దేశ 7.8% పెరిగింది. ఇప్పుడు మార్పులు, ఖర్చుల పెరుగుదల ద్వారా ఈ వృద్ధి మరింత బలపడుతుందని కేంద్రం ఆశిస్తోంది.

రీసెర్చ్ ప్రకారం... మార్పులు ం ఆదాయపు పన్ను తగ్గింపుల వల్ల రూ.5.31 లక్షల కోట్లు వినియోగం పెరిగే అవకాశం ఉందని %ూదీ×% రీసెర్చ్ చెబుతోంది. ఇది దేశ %+ణూ%లో 1.6% పెరుగుదలకు దారితీసే అవకాశం ఉంది.

ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఈ రివిజన్లు మూడు ముఖ్యమైన పాయింట్లపై ఆధారపడి ఉన్నాయి. నిర్మాణాత్మక సంస్కరణలు, రేట్ల సరళీకరణ, ఈజ్ ఆఫ్ లివింగ్. ఇది దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దే విషయంలో కీలక నిర్ణయమని చెప్పవచ్చు. రాష్ట్రాల అభ్యంతరాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పంజాబ్, బెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాలు ఈ మార్పులకు ఒప్పుకోకపోవచ్చు. ఎందుకంటే వీటికి వచ్చిన రెవెన్యూ లోటు ఎలా భర్తీ చేస్తారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిని అదనపు ట్యాక్స్ ద్వారా పూడ్చాలని భావిస్తున్నారు. మొత్తంగా %+ూ%లో ఈ మార్పులు వస్తే, ధరలు తగ్గిపోయి సామాన్యులకు నేరుగా ప్రయోజనం జరిగే అవకాశం ఉంది.

## త్వరగా కోటీశ్వరులు కావాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలి..




ఇటీవల కాలంలో అనేక మంది కూడా ఎక్కువగా మ్యూచువల్ ఫండ్లవైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఎందుకంటే ఇవి ట్రెడిషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పద్ధతులతో పోల్చితే మంచి ఫ్లెక్సిబిలిటీతో పాటు ఎక్కువ రాబడులను అందిస్తాయి. మ్యూచువల్ ఫండ్లలో మనం ఇన్వెస్ట్ చేసే మొత్తం, వ్యవధి తోపాటు అనేక ఆప్షన్లు ఉంటాయి. అయితే మీరు రూ.1 కోటి సొమ్మును త్వరగా సేవ్ చేయాలంటే, నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలి, ఏన్నేళ్లు చేయాలనే తదితర విషయాలను ఇప్పుడు చూద్దాం అనేది ప్రతి నెలా లేదా పరిమిత కాలంలో ఒక చిన్న మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టే విధానం. ఈ విధానం చిన్న మొత్తాలతో మొదలుపెట్టి, ఎక్కువ మొత్తాన్ని కూడబెట్టే అవకాశాన్ని ఇస్తుంది. దీనిలో పవర్ ఆఫ్ కాంపౌండింగ్ వల్ల మీరు పొందే రాబడుల మీద కూడా లాభాలు వస్తాయి. అంటే మీరు మొదట పెట్టిన మొత్తానికి లాభాలు వస్తే, ఆ లాభాలు కూడా తిరిగి స్కీమ్‌లో చేరి, తర్వాత కాలంలో వాటిపైనా లాభాలు వస్తాయి. దీని వల్ల మీ మొత్తం పెట్టుబడి భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మీరు ప్రతి నెలా రూ.16,500 సిప్ రూపంలో 15 సంవత్సరాలు ఇన్వెస్ట్ చేస్తే, సగటున 15% వార్షిక రాబడి వస్తే, మీకు వచ్చే మొత్తం రూ.1 కోటి దాటే అవకాశం ఉంది. ఇక్కడ మీరు చేసిన పెట్టుబడి రూ.29,70,000 కాగా, మీకు వడ్డీ రూపంలోనే రూ.72,00,032 లభిస్తాయి. అంటే మీకు 15 ఏళ్లలో మీరు ఇన్వెస్ట్ చేసిన దానికి దాదాపు నాలుగింతల మొత్తం (రూ.1,01,70,032) వచ్చే ఛాన్సుంది. సాధారణంగా వార్షిక రాబడి రేటు ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లలో కనీసం 12 శాతం నుంచి 21 శాతం వరకు వస్తుంది.ప్రతి నెలా ఒక నిర్దిష్ట మొత్తాన్ని పెట్టుబడి చేస్తూ పెట్టుబడి చేసే అలవాటు పెరుగుతుంది. దీని వల్ల మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా, మీరు పెట్టుబడి కొనసాగించవచ్చు. మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నిసార్లు ఎక్కువ, కొన్నిసార్లు తక్కువగా ఉంటుందిసిప్ వల్ల మార్కెట్ పతనమైనప్పుడు ఎక్కువ , మార్కెట్ పెరిగినప్పుడు తక్కువ కొనుగోలు చేయాలి. దీని వల్ల సగటు కొనుగోలు ధర తక్కువ అవుతుందిమీరు తొందరగా పెట్టుబడులు చేయడం ప్రారంభిస్తే, కాంపౌండ్ ఇంట్రెస్ట్ వల్ల మీ పెట్టుబడి దీర్ఘకాలంలో బారీగా పెరుగుతుంది

## "రూ.2.40 కోట్ల కవర్ ఉన్నప్పటికీ రూ.61 లక్షల క్లెయిమ్ తిరస్కరణ నిజమేనా ..పోస్ట్ వైరల్

ఇన్సూరెన్స్ ఉంటే చాలు... కష్టం వచ్చినప్పుడు కాపాడుతుందనే నమ్మకంతో చాలామంది ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు చేసి హెల్త్ పాలసీలు తీసుకుంటారు. కానీ, నిజంగా ఆ పాలసీలు అవసరం వచ్చినప్పుడు మనల్ని కాపాడతాయా అన్న ప్రశ్న చాలా మందికి కలుగుతోంది. ఎందుకంటే ఇటీవల ఒక వైరల్ పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.అవిగ్యాన్ మిత్రా అనే వ్యక్తి చేసిన ఈ పోస్ట్‌లో ఓ వ్యక్తి చికిత్స కోసం పెట్టిన రూ.61 లక్షల నగదు రహిత క్లెయిమ్‌ను, ఆయన వద్ద ఉన్న రూ.2.40 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నా సరే, తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు

సమస్య ఎలా మొదలైంది?

అవిగ్యాన్ మిత్రా వెల్లడించిన వివరాల




ప్రకారం:చంద్ర కుమార్ జైన్ కు రూ. 2.4 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంది (రూ. 1 కోటి బేస్ పాలసీ ం రూ. 1.4 కోట్లు నో-క్లెయిమ్ బోనస్).అయినప్పటికీ, ఇన్సూరెన్స్ కంపెనీ ఒక్కసారిగా లైయాబిలిటీ ఎస్టాబ్లిష్ చేయలేమనే కారణంతో క్యాష్‌లెస్ మంజూరు చేయలేదని చెప్పారు. మీరు ఏళ్ల తరబడి ప్రీమియం కడతారు, భారీ కవర్ తీసుకుంటారు. కానీ అసలు సమయంలో బీమా కంపెనీ మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తుందని అవిగ్యాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చిన్న టెక్నికల్ సమస్య కాదని, హెల్త్ ఇన్సూరెన్స్ ఆయా కుటుంబాలకు కష్ట సమయంలో అండగా నిలవాలన్నారు. ఇది కేవలం చిన్న పొరపాటు కాదు. ఇది ఆరోగ్య భీమా రంగం పట్ల కలిగించిన నమ్మకాన్ని మోసం చేసినట్లేనని అన్నారు.కంపెనీ సమాధానంఈ పోస్ట్ వైరల్ కావడంతో నివా బుపా మార్కెటింగ్ అధికారి నిమిష్ అగర్వాల్ స్పందించారు.జూన్ 27న అడ్మిట్ అయిన జైన్ గారికి మొదట్లో రూ. 25 లక్షల ప్రీ ఆథరైజేషన్ మంజూరు చేశామని చెప్పారు.అయితే ట్రీట్మెంట్ ఖర్చులు ఇప్పుడు రూ. 70 లక్షలకి మించి పోయాయని, ఇది సాధారణమైనది కాదన్నారు

## ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్న సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారం కాస్త సానుకూలంగా చలిస్తున్నాయి. సోమ, మంగళవారాలు భారీ లాభాలను ఆర్జించిన స్టాక్ మార్కెట్లు బుధవారం మాత్రం ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్నాయి. జీఎస్టీ నూతన సంస్కరణలపై బుధవారం, గురువారం మండలిలో చర్చించబోతున్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో కొనసాగుతున్నాయి మంగళవారం ముగింపు (80, 157)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభ నష్టాలతో దోబూచులాడుతోంది. ఒక దశలో 200 పాయింట్లకు పైగా లాభపడి మళ్లీ వెనక్కి వచ్చింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 20 పాయింట్ల లాభంతో 80, 177 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 9 పాయింట్ల లాభంతో 24, 589 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో పిరామిల్ ఫార్మా, మనప్పురం ఫైనాన్స్, యెస్ బ్యాంక్, డెలివరీ,

## బాబోయ్ మళ్లీ పెరిగిన గోల్డ్ ధరలు.. ఈసారి రికార్డ్ స్థాయి ఎంతంటే..

బంగారం ధరలు మళ్లీ పైపైకి చేరుతున్నాయి. తాజాగా ఎప్పుడూ లేని విధంగా కొత్త గరిష్ఠాన్ని తాకాయి. సెప్టెంబర్ 3న ఉదయం %వీజశ% ఫ్యూచర్స్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,06,199కి చేరింది. అంటే దాదాపు 0.5% పెరిగింది. ఇది ఇప్పుడు దేశీయ మార్కెట్లో ఎప్పటికీ లేని రేటు అని చెప్పవచ్చు. ఈసారి ధరలు పెరగడానికి ప్రధాన కారణం అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చనే అంచనాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు కూడా దీనిపై ప్రభావం చూపిస్తున్నాయి. అమెరికా తన టారిఫ్ విధానంలో మార్పులు చేయబోమని ట్రంప్ చెప్పడంతో ఆర్థిక అనిశ్చితి పెరిగింది. ఈ సందర్భంలో సేఫ్ హావెన్ అన్న పేరుతో బంగారం మళ్లీ ఫేవరేట్ పెట్టుబడి ఆప్షన్‌గా మారింది. దీంతో అనేక మంది పసిడి పెట్టుబడుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు.ప్రస్తుతం ఇన్వెస్టర్లు గోల్డ్ సిల్వర్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ బేస్ట్ అయిన హోల్డింగ్స్ 1.32% పెరిగి 990.56 టన్నులకు చేరాయి. ఇది ఆగస్ట్ 2022 తరువాత గరిష్ఠం కావడం విశేషం.అమెరికాలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర %వి%3,616.70కు చేరింది. ఇది కూడా రికార్డ్ లెవెల్ అని చెప్పవచ్చు. సెప్టెంబర్ 17న అమెరికా ఫెడ్ తమ వడ్డీ విధానంపై నిర్ణయం తీసుకోనుంది. అప్పటికే మార్కెట్లు 92% మేర వడ్డీ రేట్లు 0.25% తగ్గుతాయని ఊహించుకుంటున్నాయి. ఈ వారం శుక్రవారం రానున్న డేటా కూడా చాలా కీలకం కానుంది. అది కూడా ఫెడ్ నిర్ణయంపై ప్రభావం చూపించవచ్చు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006